


# సెబ్బాష్ రాజుగారు

ఒక రాజున్నాడు. దగ్గడు తుమ్మడు. జ్వరం వచ్చిందనేసి నాలుగు రోజులు ముసుగు తన్నడు. రాజనేవాడు చెడీబడీ తింటాడు... వేటకనీ యుద్ధాలకనీ తిరుగుతుంటాడు... అయినాగానీ ఒక్కసారి కూడా రోగమూ రొష్టూ అనడు... ఏందబ్బా అని అందరికీ బలే ఆశ్చర్యం.

రాజుని పుట్టినప్పటి నుంచి చూస్తున్న మంత్రి యింక ఉండబట్టలేక 'మహారాజా, ఏమి ఈ వింత? మీది ఒళ్లా? వజ్రమా? మన దర్బారులో ఎందరికో ఎన్నో రోగాలు వస్తుంటాయి పోతుంటాయి. కాని మీరు జీవితంలో ఒక్కసారైనా తలనొప్పి అని కూడా అనరు. ఈ రహస్యం ఏమిటి? నాకు చెప్పరా?' అని అడిగాడు.

అప్పుడు రాజు నవ్వి 'ఏం లేదు మంత్రిగారూ. యిందులో రహస్యం ఏమీ లేదు. నువ్వు రాజ్యాలు ఏలు. సింహాసనాల మీద కూర్చో. లేకుంటే కూలి పని చెయ్యి. కాకుంటే యింకే పనైనా చెయ్యి. కాని వేళకు యింత తినేస్తే రోగం నీవైపు చూడదు. యిప్పుడు నేనున్నాను గదా. పొద్దున్నే లేస్తా. ఫలానా టైములో నాస్టా చేస్తా. మధ్యాహ్నం దర్బారు ముగిస్తా. ఫలానా టైములో భోజనం చేస్తా. రాత్రికి మంతనాలు చాలిస్తా. ఫలానా టైములో తిని నిద్రపోతా. పుట్టి బుద్ధెరిగినప్పటి నుంచి ఈ నియమాన్ని ఒక్కరోజు కూడా తప్పలేదు. ఎంత రాచకార్యం వున్నా వేళకు భోజనం చెయ్యాలి. అదే ఆరోగ్యం' అన్నాడు.

మంత్రిగారికి మనసులో చిన్న తమాషా చేద్దామనిపించింది. ఈయన వేళకు తింటాడు గదా ఒక్కపూట ఆ వేళను తప్పిద్దాం ఏమవుతుందో చూద్దాం అనుకున్నాడు.

ఆ మరుసటిరోజు మధ్యాహ్నం పరిచారికలకు చెప్పి స్నానానికి వేడినీళ్లు ఆలస్యమయ్యేట్టు చేశాడు. స్నానాల గదికి చేరుకున్న రాజుగారు 'ఏమిటి ఆలస్యం? అవతల భోజనానికి వేళవుతోంది?'' అని కేకలు పెడుతున్నారు.

'అయిపోయింది మహారాజా. అయిపోయింది మహారాజా' అని కావాలని పరిచారికలు యింకాస్త ఆలస్యం చేసి గదిలో వేడినీళ్ళు పెట్టారు.

స్నానాల గదిలోకి రాజు వెళ్లేసరికి సరిగ్గా ఒంటిగంట. రోజూ ఆ టైముకి ఆయన స్నానం చేసేసి భోజనాల గదిలో వుంటారు. యిప్పుడేం చేయాలి? భోజనానికి ఐదు నిమిషాలు ఆలస్యమయ్యేట్టుందే అనుకున్న రాజు చాలా కంగారుపడి చుట్టూ చూశాడు.

ఉన్నట్టుండి ఆయన కంగారు తగ్గింది. ఆ తర్వాత హాయిగా స్నానం చేసి బయటకు వచ్చేశాడు. రెండు వారాలు గడిచాయి. యిదిగో జబ్బున పడతాడు, అదిగో జబ్బున పడతాడు అని ఎదురుచూసిన మంత్రి చివరకు విసిగిపోయి 'మహారాజా వేళకు ఆహారం తీసుకుంటే ఆరోగ్యం చెడదని మీరన్నారు. కానీ ఫలానా రోజున మధ్యాహ్నం పూట మీరు వేళతప్పి భోజనం చేశారు. మీరు చెప్పిన ప్రకారం ఈపాటికి మీ ఆరోగ్యం చెడాలి. చెడలేదు. అంటే మీరు చెప్పిందంతా అబద్ధమేనా?'' అని అడిగాడు.

ఆ మాటకు రాజు నవ్వి 'భలేవాడివే మంత్రి. ఆ రోజు నేను వేళ ఎక్కడ తప్పాను? స్నానాల గదిలో నాకోసం మేలిమి రకమైన సున్నిపిండిని సిద్ధం చేసి వుంచారు గదా. నేను టయానికి ఆ సున్నిపిండిని తాగేశా. యింకేంది?' అన్నాడు.

ఆ సంగతి విని మంత్రి ఎంతో ఆశ్చర్యపోయాడు.

'అయితే మహారాజా మిమ్మల్ని ఆ దేవుడు కూడా ఏమీ చేయలేడు సెబ్బాష్' అని మెచ్చుకున్నాడు.